ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
సిద్దిపేట 5
శుక్రవారం 20 సెప్టెంబరు 2024


చిన్నకోడూరు మండలం రామునిపట్ల- గోనెపల్లి గ్రామాల మధ్య లోలెవల్ వంతెనపై ఉధృతంగా ప్రవహిస్తున్న నీరు (ఫైల్)

శంకుస్థాపనకే పరిమితం

- హై లెవెల్ వంతెన నిర్మాణానికి గ్రహణం
- పది నెలలు గడుస్తున్నా ప్రారంభంకాని పనులు
- నత్తనడకన సికింద్లాపూర్- దర్గపల్లి వంతెన నిర్మాణం
- వర్షాలు కురిసినప్పుడు ప్రజలకు తప్పని తిప్పలు

7

గణేష్ నిమజ్జనంలో అపశ్రుతి

- ప్రమాదవశాత్తు చెట్టు పైనుంచి పడిన వ్యక్తి
- ఆసుపత్రిలో పరిస్థితి విషమించి మృతి


నర్సింహులు (ఫైల్)

కొండపాక, సెప్టెంబరు 19 : గణేష్ నిమజ్జన ఊరేగింపులో అపశ్రుతి చోటు చేసుకున్నది. చెట్టుపై నుంచి పడిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. ఈ సంఘటన కొండపాకలో చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండపాకలో గణేష్ నిమజ్జనం బుధవారం రాత్రి ప్రారంభమైంది. రాత్రి 11 గంటలకు ఊరేగింపు శివాలయం వరకు చేరుకున్నది. యువకులు డాన్స్ చేస్తుండగా మంచాల నర్సింహులు (50) డాన్స్ చేయడానికి కొమ్మల కోసం వేపచెట్టు ఎక్కాడు. ఈ క్రమంలో కొమ్మ విరిగి కిందపడడంతో తలకు గాయాలయ్యాయి. వెంటనే అక్కడున్న వారు సిద్దిపేట ప్రైవేట్ ఆసుపత్రికి, చికిత్స అనంతరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గురువారం చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. కుకునూరుపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. నర్సింహులు వ్యవసాయంతో చేస్తూ జీవనం సాగించేవాడు. మృతునికి భార్య, ఒక కొడుకు, ఇద్దరు కూతుళ్ల ఉన్నారు. ఇద్దరు కూతుళ్ల పెళ్లి చేశాడు.

ఓటరు జాబితాపై అభ్యంతరాలుంటే తెలపాలి

- డీపీవో దేవకీదేవి, ఎంపీడీవోలు
- రాజకీయ నాయకులతో సమావేశం

8

మందుల్లేవు...



చేర్యాల ప్రభుత్వ ఆసుపత్రి

ఓ పక్క వైరల్ జ్వరాలు.. మరోపక్క ఒంటినొప్పులతో ప్రజలు మంచంపడుతున్నారు. ఎవరిని కదిలించినా అనారోగ్య సమస్యలే వల్లెవేస్తున్నారు. మరణించిన వారు కూడా లేకపోలేదు. డెంగ్యూ, టైఫాయిడ్, చికున్‌గున్యా తదితర వ్యాధులతో ఆస్పత్రుల పాలవుతున్నారు. కొంతమంది ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి రోగాలను నయం చేసుకుంటుండగా... ఆ స్థోమత లేనివారు ప్రభుత్వ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. అయితే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందులు లేక బాధితులు ఇబ్బంది పడుతున్నారు.

-ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్ది పేట

“ ‘సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో కీలకమైన పారాసెటమాల్, నొప్పుల ఇంజక్షన్లు(డైక్లోఫినాక్), జలుబు, దగ్గుకు సంబంధించిన లివోసిట్రిజిన్, డైక్లోఫినాక్ టాబ్లెట్లు, 2ఎంఎల్, 5ఎంఎల్ సిరంజీల కొరత ఉంది. ఐ డ్రాప్స్ కూడా లేవు. సంగారెడ్డిలోని మార్క్సనగర్ యూపీహెచ్‌సీలోనూ డైక్లోఫినాక్‌తోపాటు జలుబును తగ్గించే మందులు లేవు.’

‘మెదక్ జిల్లా ఆసుపత్రిలో డైక్లోఫినాక్ ఇంజక్షన్ లేకపోవడంతో ఆసుపత్రి సూపరింటెండెంట్ తన పరిధిలో ఉన్న బడ్జెట్‌తో స్థానిక ఏజెన్సీలో కొనుగోలు చేస్తున్నారు. ఈ ఇంజక్షన్‌ను సర్జరీలతోపాటు నొప్పుల తీవ్రత ఎక్కువగా ఉన్నవారికి వినియోగిస్తారు. ఈ ఇంజక్షన్ చాలా అత్యవసరమైనది.’

‘సిద్దిపేట జిల్లా చేర్యాల పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో పారాసెటమాల్ ఐవీ, రాంటాక్, ప్యాన్‌టాప్ ఇంజక్షన్ల కొరత ఉంది. అదేవిధంగా డైక్లోఫినాక్ టాబ్లెట్లు అందుబాటులో లేవు. ప్రస్తుత సీజన్‌లో పారాసెటమాల్‌తోపాటు అత్యవసరమైన ర్యాన్‌టాక్, ప్యాన్‌టాప్‌లను రోగులకు సరిపడా సరఫరా చేయాల్సిన అవసరం ఉంది.’ ”

వైద్యారోగ్య శాఖ మంత్రి ఇలాకాలో...

- ఉమ్మడి జిల్లాలోని పీహెచ్‌సీలు, ప్రభుత్వాస్పత్రుల్లో లోటు
- డైక్లోఫినాక్ ఇంజక్షన్లు, టాబ్లెట్ల కోసం ఎదురుచూపు
- లివోసిట్రిజన్, పారాసెటమాల్, అజిత్రోమైసిన్ అవసరమే
- రోగాల సీజన్‌లో సరిపడా మందుల్లేని వైనం
- పలుచోట్ల ప్రైవేట్ ఏజన్సీల్లో కొనుగోలు



వానాకాలం సీజన్‌లో వైరల్ ఫీవర్లు, జలుబు, దగ్గు సోకుతుంటాయి. జ్వరాలు తగ్గినా ఒళ్లునొప్పులు ఇబ్బందిపెడుతుంటాయి. ఇలాంటి పరిస్థితుల్లో జ్వరానికి పారాసెటమాల్, జలుబుకు లివోసిట్రిజన్, ఒళ్లునొప్పులకు డైక్లోఫినాక్ ఇంజక్షన్లు, టాబ్లెట్లను డాక్టర్లు ఇస్తుంటారు. కానీ, ప్రభుత్వ ఆస్పత్రుల్లో డైక్లోఫినాక్ ఇంజక్షన్ల కొరత తీవ్రంగా ఉన్నట్లు తెలుస్తున్నది. పారాసిటమాల్, లివోసిట్రిజిన్ మందులు సైతం సరిపడా లేవని వైద్యులే చెబుతున్నారు. కొరత ఉన్నా త్వరగానే సరఫరా చేస్తున్నారని, పెద్దగా సమస్యలు తలెత్తడం లేదని అంటున్నారు.



మంత్రి దృష్టిపెట్టాలి

వైద్యఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఉమ్మడి మెదక్ జిల్లా నుంచే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. పలుమార్లు ఆయన ప్రభుత్వాస్పత్రులు, పీహెచ్‌సీల పనితీరుపై దృష్టిసారించారు. అయితే గతంలోనూ మందుల కొరత వచ్చినప్పటికీ తాత్కాలికంగా చర్యలు చేపట్టారు. ప్రస్తుతం మళ్లీ మందుల కొరత తెరమీదకొస్తున్నది. కొన్ని ఆస్పత్రుల్లో 3 నెలలకు సరిపడా మందులు అందుబాటులో ఉండగా, ఇంకొన్నిచోట్ల మందులు ఎప్పుడు నిండుకుంటాయో తెలియని దుస్థితి నెలకొంది. అందుకే రోజువారీ చార్ట్ ఆధారంగా పీహెచ్‌సీలు, ప్రభుత్వ ఆసుపత్రులకు అవసరమయ్యే మందులను 3నెలలకు సరిపడా సరఫరా చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఏ ఒక్క మెడిసిన్ లేకున్నా వాటి కోసం మళ్లీ ప్రైవేట్ మందుల దుకాణాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఈ పరిస్థితులపై మంత్రి దృష్టిపెట్టాలని.. శాశ్వతంగా మందుల కొరత రాకుండా చర్యలు చేపట్టాలని స్థానికంగా విన్నవిస్తున్నారు.

అక్కడక్కడా కొరత

- రామాయంపేట ఏరియా ఆసుపత్రిలో 2 నెలలుగా డైక్లోఫినాక్ మెడిసిన్‌ను సరఫరా చేయడం లేదు.
- పాపన్నపేట పీహెచ్‌సీలో అజిత్రోమైసిన్, పిరోజోలిడిన్, సిప్రొఫ్లాక్సిన్ మందుగోలీలు అందుబాటులో లేవు.
- కౌడిపల్లి సీహెచ్‌సీ, పీహెచ్‌సీలలో డైక్లోఫినాక్ మినహా మిగితా మందులు ఉన్నాయి.
- వెల్దుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో లివోసిట్రిజిన్, బీ-కాంప్లెక్స్ మందులు 200 మందికి మాత్రమే సరిపడా ఉండగా మిగితా మందులున్నాయి.
- చిన్న శంకరంపేట పీహెచ్‌సీలోనూ డైక్లెఫెనాక్ ఇంజక్షన్ కొరత ఉంది.
- కంది ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డైక్లోఫినాక్ ఇంజక్షన్లు అందుబాటులో లేవు.
- తొగుట పీహెచ్‌సీలో గత 15 రోజులుగా డైక్లోఫినాక్ ఇంజక్షన్‌లు అందుబాటులో లేవని వైద్యులు చెప్పారు.
- రాయపోల్ పీహెచ్‌సీలో లివోసిట్రిజన్ టాబ్లెట్ల కొరత ఉంది.

సిద్దిపేటలో భారీ శాంతిర్యాలీ

- మహ్మద్ ప్రవక్త జన్మదినం పురస్కరించుకుని ప్రత్యేక ప్రార్థనలు

సిద్దిపేట కల్చరల్, సెప్టెంబరు 19: మహ్మద్ ప్రవక్త జన్మదినం (మిలాద్-ఉన్-నబీ) పురస్కరించుకుని పస్బానే మిల్లత్ మిలాద్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం సిద్దిపేటలో భారీశాంతి ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని బస్టాండ్ వద్ద గల పిర్దౌస్ మసీదు నుంచి మెదక్ రోడ్డు, గాంధీ పార్కు, ఇక్బాల్ మినార్, ముస్తాబాద్ చౌరస్తా నుంచి ఈద్గా వరకు కొనసాగింది. అనంతరం దర్గాలో ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ముస్లిం మతపెద్దలు ఇమామ్‌లు ఇక్బాల్ అశ్రఫీ, కరీంపటేల్ మాట్లాడుతూ మహ్మద్ ప్రవక్త చూపిన బాటలో నడవాలని సూచించారు. తోటివారికి సహకారం అందించే గుణం కలిగి ఉండాలన్నారు. శాంతి, ధర్మం, ఓపికతో ఎవరైతే నిరాడంబర జీవితం గడుపుతారో వారు భగవంతునికి ప్రీతిపాత్రులవుతారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ర్యాలీలో పలువురు కాంగ్రెస్ నేతలు పండ్లు, వాటర్‌బాటిల్స్ పంపిణీ చేశారు.



సిద్దిపేట పట్టణంలో శాంతిర్యాలీ

ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు : సీపీ అనురాధ



వినాయకచవితి, నిమజ్జనం, మిలాద్ ఉన్ నబీ పండుగలు ప్రశాంతమైన వాతావరణంలో జరిగాయని సీపీ అనురాధ తెలిపారు. ఇందుకు సహకరించిన జిల్లా ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, వినాయక మండపాల నిర్వాహకులు, ముస్లిం పెద్దలకు, తంజీమ్ కమిటీకి ధన్యవాదాలు తెలిపారు. పోలీసులు 15 రోజులుగా నిర్విరామంగా విధులు నిర్వహించారని ఆమె అభినందించారు. గణేష్ ఉత్సవాలు జరుగుతున్న సమయంలోనే మిలాద్ ఉన్ నబీ పండుగ సందర్భంగా వేడుకలు, ర్యాలీలు చేశారని, అన్ని వర్గాల వారు పరస్పర సహకారంతో శాంతియుత వాతావరణంలో పండుగలు చేసుకున్నారని ఆమె తెలిపారు. రెవెన్యూ, గ్రామపంచాయతీ, మున్సిపల్, ఆబ్కారీశాఖ, ఫైర్ సర్వీసెస్, ప్రింట్ అండ్ ఎలాక్ట్రానిక్ మీడియా, గజ ఈతగాళ్లు తమ సేవలను అందించారని, అందుకు ప్రతి ఒక్కరికీ సీపీ కృతజ్ఞతలు తెలిపారు.


ర్యాలీలో ముస్లింలు



ర్యాలీలో మాట్లాడుతున్న ముస్లిం మతపెద్దలు



కోనసీమ కాదు.. కొండపాక

చుట్టూ పచ్చని పొలాలు.. వాటి మధ్య అక్కడక్కడ ఎత్తైన తాటిచెట్లు.. దూరంగా ఉన్న గుట్టలపై పచ్చదనం.. ఈ రమణీయ దృశ్యం కోనసీమలో కాదు.. మన కొండపాకలోనిదే.. ఈ సంవత్సరం వర్షాలు సమృద్ధిగా కురవడంతో సాగు విస్తీర్ణం పెరిగింది. పొలాల మధ్య ఉన్న తాటిచెట్లు, గుట్టలపై మొక్కలు, చెట్లు పచ్చదనాన్ని పులుముకున్నాయి. కొండపాక, తిమ్మారెడ్డిపల్లి, మర్పడగ, రాంపల్లి తదితర గ్రామాలకు వెళ్లే రోడ్లకు ఇరువైపులా ఈ దృశ్యాలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి.

- కొండపాక


మద్దూరు కస్తూర్బా పాఠశాల ఆవరణలో మురుగు గుంత

సమస్యల కస్తూర్బా

7 లో..

- డ్రైనేజీ దుర్వాసనతో విద్యార్థినులకు అవస్థలు
- మరమ్మతులకు నోచని వాటర్‌ప్లాంట్, సోలార్ వాటర్ హీటర్
- పాలకులు, అధికారులకు విన్నవించినా పట్టించుకోని వైనం

విద్యాభివృద్ధిలో మార్పునకు ఉపాధ్యాయులు కృషిచేయాలి

- కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను మార్చాలి
- ఉపాధ్యాయుల నుంచి సామాజిక మార్పు రావాలి
- ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం

గజ్వేల్, సెప్టెంబరు 19: విద్యాభివృద్ధిలో మార్పునకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో గురువారం రాత్రి నిర్వహించిన టీపీటీఎఫ్ ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కళ్లతో చూడలేని ప్రపంచాన్ని చూపించే శక్తి విద్యకు మాత్రమే ఉందన్నారు. పేద, మధ్య తరగతి పిల్లలు చదువుకునే ప్రభుత్వ పాఠశాలలను బాగు చేయాలన్న ఆలోచన ప్రభుత్వానికి ఉందని, ఉపాధ్యాయుల నుంచి సామాజిక మార్పు రావాలన్నారు. నాణ్యమైన విద్యను అందించాలని, ఢిల్లీ పబ్లిక్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను మార్చాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో విద్యా వ్యవస్థలో మార్పునకు శ్రీకారం చుట్టారని, అందులో భాగంగానే ఏళ్లుగా ఉపాధ్యాయులు ఎదురుచూస్తున్న బదిలీలు, పదోన్నతులు కల్పించారని చెప్పారు. పాఠశాలల్లో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న విద్యుత్ సమస్యను పరిష్కరించారన్నారు. స్కావెంజర్లు, అటెండర్ల విషయమై ప్రభుత్వం ఆలోచన చేస్తుందని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలకు తీసుకొచ్చేందుకు చేపట్టాల్సిన చర్యల్లో భాగంగానే అంగన్‌వాడీలను ప్రీప్రైమరీలుగా అప్‌గ్రేడ్ చేయడంతో పాటు ప్రాథమిక విద్యలో మార్పునకు శ్రీకారం చుట్టారని చెప్పారు. ప్రతీ తరగతికి ఉపాధ్యాయుడిని నియమించాలన్న ఆలోచనలో ఉందన్నారు. ఉన్నత విద్యారంగానికి సంబంధించిన సమస్యలు ప్రభుత్వం దృష్టిలో ఉన్నాయని, ఒక్కొక్కటిగా పరిష్కారం చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఎన్‌ఆర్‌ఐలు సైతం విద్యవ్యవస్థ బలోపేతానికి ముందుకొచ్చారని, ల్యాబ్ ఆన్ వీల్స్ పేరిట కార్యక్రమాన్ని చేపట్టారని, వారానికి ఒక స్కూల్‌కు వెళ్లి త్రీడీ ద్వారా విద్యార్థులకు ల్యాబ్‌ల ప్రాముఖ్యతను వివరించనున్నారని తెలిపారు. టీపీటీఎఫ్ పాఠశాలల్లో నెలకొన్న ఫ్యూడల్ వ్యవస్థపై పోరాడిందని, విద్యావ్యవస్థలో రాజకీయ జోక్యాన్ని ఎప్పటికప్పుడు ఖండించిందన్నారు. టీపీటీఎఫ్ సమాజ మార్పులో కీలకంగా పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి, అదనపు కార్యదర్శి రవిందర్, కనకయ్య, భాస్కర్ రెడ్డి, ప్రకాశ్‌రావు, రాంచంద్రం రాజులు, జగదేవ్‌పూర్ ఎంఈవో ఉదయ్‌భాస్కర్, సుంచు నరేందర్, రామస్వామి, తిరుపతిరెడ్డి, ఎల్లయ్య, దమ్మని మల్లేశం, పాపిరెడ్డి, పర్వతం నర్సయ్య, సత్తయ్య తదితరులున్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కోదండరాం

ఉల్లాసంగా ఉద్భవ్ ఫెస్ట్

సిదిపేట ప్రభుత్వ వైద్య కళాశాల వార్షికోత్సవం సందర్భంగా ఉద్భవ్ పేరిట కళాశాల ఫెస్ట్ ఉల్లాసంగా సాగుతున్నది. ఈ సందర్భంగా ర్యాంపు వాక్ చేస్తూ, ఆటపాటలతో ఆకట్టుకుంటున్నారు. రోజుకో రకమైన కార్యక్రమంతో మెడికల్ స్టూడెంట్స్ సందడి చేస్తున్నారు.

- సిద్ధిపేట ఫొటోగ్రాఫర్



గీతమ్‌లో నాడీ వ్యవస్థపై వెబినార్

పటాన్‌చెరు, సెప్టెంబరు 19: 'గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీలో నాడీ వ్యవస్థ ఆధ్యాత్మికత: ఒత్తిడిని అధిగమించే రహస్య ఆయుధం' అంశంపై గురువారం వెబినార్ నిర్వహించారు. పంజాబ్‌కు చెందిన ఎనర్జీ వెల్‌నెస్ పర్పస్ కోచ్ లిప్పీ భల్లా, డాక్టర్ నవీన్‌కుమార్ కొట్టాకిలు వెబినార్‌లో మాట్లాడారు. ఒత్తిడిని అధిగమించడం, మానవులు, వ్యవహార సరళిపై నాడీ వ్యవస్థ ప్రభావాలను వివరించారు. కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.శివకుమార్, కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ గటాడి శ్రీకాంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఒడ్డు జారి కిందపడి వ్యక్తి మృతి

చిన్నశంకరంపేట, సెప్టెంబరు 19: పొలం వద్దకు ఒడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన చిన్నశంకరంపేట మండల కేంద్రంలో గురువారం చోటు చేసకుంది. ఎస్ఐ నారాయణగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన నిద్రబోయిన యాదగిరి (41) తన వ్యవసాయ పొలం వద్దకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బయలుదేరాడు. ఓ రైతు పొలం ఒడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో కాలు జారి వరి పొలంలో పడ్డాడు. బురదలోకి ముఖం దూరుకుపోవడంతో ఊపిరాడక మృతి చెందాడు. యాదగిరి మధ్యాహ్నం దాటినా ఇంటికి రాలేదు. దీంతో కుటుంబీకులు పొలం వద్దకు వెళ్లి చూడగా వరి పొలంలో పడి విగితజీవిగా కనిపించాడు. మృతుడికి భార్య అంజమ్మ, కూతరు భూమిక ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


యాదగిరి(ఫైల్)

న్యాల్‌కల్‌లో మైనింగ్ అధికారుల దాడులు

● లారీ, రాయికోత యంత్రాల సీజ్

న్యాల్‌కల్, సెప్టెంబరు19 : అక్రమంగా చేపడుతున్న ఎర్రరాయి తవ్వకాలపై గురువారం దాడులుచేసి రెండు కోత యంత్రాలను, ఎర్రరాయిని తరలిస్తున్న లారీని సీజ్ చేసినట్లు మైనింగ్ అధికారులు, రెవెన్యూ అధికారులు తెలిపారు. వారి కథనం ప్రకారం నమ్మదగిన సమాచారం మేరకు మైనింగ్, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా గణేష్‌పూర్ ఎర్రరాయి గనులపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో రెండు కోత యంత్రాలు, ఎర్రరాయిని తరలిస్తున్న లారీని సీజ్‌చేశారు. ఈ దాడుల్లో మైనింగ్ ఆర్ఐ సాయిరాం, రెవెన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


ఎర్రరాయిని లారీని సీజ్ చేసిన మైనింగ్ అధికారులు

అదృశ్యమైన మహిళ దారుణ హత్య !

● పోలీసుల అదుపులో నిందితులు

మాసాయిపేట సెప్టెంబర్ 19: ఉపాధిహామీ డబ్బుల కోసం వెళ్లి అదృశ్యమైన గిరిజన మహిళ దారుణ హత్యకు గురైనట్లుగా తెలుస్తోంది. తండావాసుల వివరాల ప్రకారం మాసాయిపేట మండలం సాజు గిరిజన తండాకు చెందిన మాలోత్ లలిత(48) ఈ నెల 11న ఉపాధి హామీ డబ్బుల కోసం బ్యాంకుకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. అయితే లలిత హత్యకు గురైనట్లు గురువారం సాజు తండావాసులు తెలిపారు. బంగారు నగల కోసం హత్య జరిగినట్లు... నిందితులు భార్యభర్తలిద్దరూ పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలిసింది. ఈ విషయమై చేగుంట పోలీసులను సంప్రదించగా పూర్తి వివరాలు త్వరలోనే వెల్లడిస్తామని, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


లలిత(ఫైల్)

పరిశ్రమలో కార్మికుడు మృతి

● చోరీ చేసి, ఆత్మహత్య చేసుకున్నాడని భార్య ఫిర్యాదు

పటాన్‌చెరు, సెప్టెంబరు 19 : విధి నిర్వహణ కోసం పరిశ్రమకు వెళ్లిన కార్మికుడు తిరిగి రాలేదు. దీంతో ఆందోళన చెందిన భార్య ఆరా తీయగా పరిశ్రమలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని యాజమాన్యం చెప్పడం గమనార్హం. బీడీఎల్ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం శ్రీకాకుళం జిల్లా, కొత్తూరు మండలం, జోగిపాడు గ్రామానికి చెందిన లూకాలపు జనార్దనరావు (45) కొంతకాలంగా చిట్కుల్ గ్రామంలో నివాసం ఉంటూ 14 సంవత్సరాలుగా పాశమైలారం సింథోకెమ్ ల్యాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో ఆర్వో ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు విధి నిర్వహణకు వెళ్లిన ఆయన 10 గంటలకు ఇంటికి రావాల్సి ఉండగా రాలేదు. ఓటీ చేస్తున్నాడనుకున్న జనార్దన్‌రావు భార్య విజయ ఉదయం కూడా తన భర్త ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెంది సాటి కార్మికులను అడగా.. పరిశ్రమలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని తెలిసింది. ఈ మేరకు బీడీఎల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన విజయ తన భర్త మృతిపై అనుమానాలు లేవని పరిశ్రమలో దొంగతనం చేసి బయటకు వస్తున్న సమయంలో స్కూటర్‌లో పరిశ్రమకు చెందిన వస్తువులు దొరకడంతో బిల్డింగ్ పైకి వెళ్లి పిల్లర్‌కి ఆత్మహత్య చేసుకున్నాడు ఫిర్యాదులో పేర్కొనటం గమనార్హం.


జనార్దనరావు మృతదేహం

పలు అనువనాలు..

కార్మికులు విధి నిర్వహణ ముగించుకుని బయటకు వెళ్లే సమయంలో మాత్రమే ప్రధాన ద్వారం వద్ద కార్మికుడిని తనిఖీ చేస్తారు. రాత్రి పది గంటలకు విధినిర్వహణ ముగించుకుని బయటకు వస్తున్న సమయంలో సెక్యూరిటీ సిబ్బందికి పట్టుబడితే తెల్లవారు ఝామున 4.30 గంటల వరకు యాజమాన్యం అతనిని ఏం చేసింది అన్నది పలు అనుమానాలకు తావిస్తున్నది. రాత్రి పది గంటలకు పరిశ్రమలో కార్మికుడు చోరీ చేస్తే పోలీసులకు అప్పగించాల్సిన యజమాన్యం అలా చేయకుండా పరిశ్రమలోనే ఎందుకు ఉంచింది. అతను ఆత్మహత్య చేసుకునేలా ప్రేరేపించారా ! లేక దాడి చేసి ఏదైనా అఘాయిత్యానికి పాల్పడ్డారా అన్న అనుమానాలు పలువురు వ్యక్తం చేస్తున్నారు. ఓటీ చేస్తే ఉదయం ఆరు గంటలకి బయటికి రావాలి. కానీ జనార్దన్ నాలుగున్నర సమయంలోనే ఆత్మహత్య చేసుకున్నట్టు యాజమాన్యం, పోలీసులు చెబుతున్నారు. అంతమంది పనిచేస్తున్న పరిశ్రమలో చోరీకి పాల్పడి దొరికిన వ్యక్తి బిల్డింగ్ పైకి వెళ్లి తాడుతో ఉరి వేసుకుంటుంటే ఎవరు చూడలేదా అన్న అనుమానాలూ లేకపోలేదు. జనార్దనరావు మృతికి యాజమాన్యమే బాధ్యత వహించాలని, యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు స్థానిక నేతలు డిమాండ్ చేస్తున్నారు.

చెరువులో మునిగి యువకుడి మృతి

● గణేష్ నిమజ్జనంలో అపశృతి

చేగుంట, సెప్టెంబరు 19: గణపతి నిమజ్జనోత్సవం ఓ కుటుంబంలో విషాదన్ని నింపింది. ఒక్కగానొక్క కొడుకుని తల్లిదండ్రులకు దూరం చేసింది. ఈ దుర్ఘటన చేగుంట మండలం పరిదిలోని ఇబ్రహీంపూర్‌లో గురువారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మైసన్నగారి భిక్షపతి, సుగుణ దంపతుల ఒక్కగానొక్క కొడుకు మైసన్నగారి నవీన్ (29) ఈ ఘనటలో మృత్యువాతపడ్డారు. గ్రామంలో అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ ఊరేగింపు బుధవారం రాత్రి మొదలవగా.. గురువారం మధ్యాహ్నం చెరువులో నిమజ్జనం చేశారు. అనంతరం స్నేహితులతో కలిసి నవీన్ చెరువులో స్నానానికి దిగి మునిగిపోయాడు. దీంతో, గజ ఈతగాళ్లతో చెరువులో గాలించగా నాలుగు గంటల అనంతరం మృతదేహాన్ని బయటకు తీశారు. చేతికొచ్చిన కొడుకు కుటుంబానికి అండగా ఉంటాడనుకుంటే అర్థాంతరం మృతిచెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా రోదించారు. విషయం తెలుసుకున్న చేగుంట పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. కేసు నమోదు చేస్తున్నట్టు తెలిపారు.


మైసన్నగారి నవీన్ (ఫైల్)

జిల్లా స్థాయి రెజ్లింగ్ పోటీలను జయప్రదం చేయండి

నారాయణఖేడ్, సెప్టెంబరు 19: నారాయణఖేడ్‌పరిధిలోని మండలకేంద్రమైన నిజాంపేటలో ఈనెల 30 నుంచి నిర్వహించనున్నజిల్లా స్థాయి రెజ్లింగ్‌పోటీలను జయప్రదం చేయాలని రెజ్లింగ్ పోటీల స్టేట్ పరిశీలకుడు సీనియర్‌పీడీ విఠల్ కోరారు. గురువారం నిజాంపేట తహసీల్దార్‌తో క్రీడల నిర్వహణపై ఏర్పాటు సమావేశంలో మాట్లాడుతూ అండర్-14 బాలబాలికలకు సంబందించి 30 కేజీల నుంచి 62 కేజీల వరకు, అండర్ -17 బాలబాలికల విభాగంలో 36 కేజీల నుంచి 73 కేజీల వరకు, అండర్ -14 బాలుర విభాగంలో 35 కేజీల నుంచి 75 కేజీల వరకు, అండర్-17 బాలుర విభాగంలో 41 కేజీల నుంచి 110 కేజీల విభాగాల్లో పోటీలుంటాయని తెలిపారు. జిల్లా పరిషత్‌పాఠశాల ఆవరనలో నిర్వహించనున్న ఈ పోటీల నిర్వహణకు అందరూ సహకరించాలన్నారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయులు ప్రవీణ్, శ్రీనివాస్‌రాథోడ్, హరి, దేవిసింగ్, లక్ష్మణ్, భారతీ, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపనకే పరిమితం



రామునిపట్ల-గోనెపల్లి మధ్య హై లెవల్ వంతెన కోసం శంకు స్థాపన చేసిన శిలాఫలకం

హై లెవెల్ వంతెన నిర్మాణానికి గ్రహణం

- పది నెలలు గడుస్తున్నా ప్రారంభంకాని పనులు
- నత్తనడకన సికింద్లాపూర్-దర్గపల్లి వంతెన నిర్మాణం
- వర్షాలు కురిసినప్పుడు ప్రజలకు తప్పని తిప్పలు



చిన్నకోడూరు మండలం రామునిపట్ల- గోనెపల్లి గ్రామాల మధ్య లోలెవల్ వంతెనపై ఉధృతంగా ప్రవహిస్తున్న నీరు (ఫైల్)

చిన్నకోడూరు, సెప్టెంబరు 19 : మండలంలోని రామునిపట్ల - గోనెపల్లి గ్రామాల మధ్య వాగుపై లో లెవల్ వంతెనతో ప్రతి వర్షాకాలంలో వరద ఉధృతి కారణంగా పలు గ్రామాల ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో లో లెవల్ వంతెన స్థానంలో హై లెవల్ వంతెన పాటు గోనెపల్లి వరకు 3 కి.మీల మేర అప్రోచ్ రోడ్డు నిర్మించేందుకు గత ప్రభుత్వం రూ.14.45 కోట్లు మంజూరు చేయగా, గతేడాది అక్టోబరులో శంకుస్థాపన కూడా చేశారు. కానీ ఇప్పటికీ హై లెవల్ వంతెన నిర్మాణ పనులు ప్రారంభం కాకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు.



సికింద్లాపూర్ - దర్గపల్లి గ్రామాల మధ్య రాకపోకలు నిలిపివేసిన దృశ్యం (ఫైల్)

వర్షం వస్తే రాకపోకలు బంద్...

వానకాలంలో రామునిపట్ల - గోనెపల్లి గ్రామాల మధ్య వాగు ఉధృతి కారణంగా రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. ఇటీవల కురిసిన వర్షానికీ రెండు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. రైతులు కూడా వ్యవసాయ బావుల వద్దకు వెళ్లలేక వరద ఉధృతి తగ్గేవరకు వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో మండలంలోని గోనెపల్లి, శంకరాయకుంట, ఓబులాపూర్, కస్తూరిపల్లి.. నంగునూరు మండలంలోని రాజగోపాల్ పేట, పాలమాకుల గ్రామాలకు వెళ్లే ప్రజలు ప్రత్యామ్నాయంగా ఇబ్రహీంనగర్ మీదుగా సుమారు 4 కిలోమీటర్లు అదనంగా ప్రయాణించి వెళ్లాల్సిన దుస్థితి నెలకొన్నది.

పూర్తికాని సికింద్లాపూర్- దర్గపల్లి వంతెన పనులు..

చిన్నకోడూరు మండలంలోని సికింద్లాపూర్, నంగునూరు మండలం దర్గపల్లికి వెళ్లే రోడ్డులో వాగుపై సుమారు రెండేళ్ల క్రితం చేపట్టిన హై లెవల్ వంతెన నిర్మాణ పనులు ఇప్పటికీ పూర్తికాలేదు. రూ.7.15 కోట్లతో పనులను ప్రారంభించగా.. ఇప్పటివరకు 60 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి. ఇటీవల కురిసిన వర్షానికి వాగు ఉధృతి పెరగడంతో అధికారులు రెండు గ్రామాలకు రాకపోకలు నిలిపి వేయడంతో వాహనదారులు ఇబ్బందులుపడ్డారు. ఈ వంతెన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయడం తోపాటు రామునిపట్ల- గోనెపల్లి గ్రామాల మధ్య వాగుపై హై లెవల్ వంతెన నిర్మాణ పనులు ప్రారంభించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు. ఈ విషయమై ఆర్అండ్‌బీ ఏఈ శ్రీకాంత్‌ను సంప్రదించగా ఆయా పనులను చేపట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు



రామునిపట్ల-గోనెపల్లి మధ్య ప్రవహిస్తున్న వాగును పరిశీలిస్తున్న సీపీ అనురాధ (ఫైల్)

యువకుడి ఆత్మహత్య



శంకర్ (ఫైల్)

పుల్‌కల్, సెప్టెంబరు 19: జీవితంపై విరక్తి చెంది ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్‌లో బుధవారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన శంకర్ (21) తండ్రి లింగమయ్య గతంలోనే మరణించగా, తల్లి యశోదతో కలిసి ఉంటున్నాడు. కొంతకాలంగా తాడ్దానిపల్లి గ్రామ శివారులోని టోల్‌ప్లాజా వద్ద పనిచేసి తల్లికి చేదోడువాదోడుగా ఉంటున్నాడు. ఎప్పటిలాగే బుధవారం విధులకు హాజరై ఇంటికి వచ్చిన శంకర్ రాత్రి గ్రామ శివారులోని పెద్ద చెరువలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుమారుడు తిరిగి ఇంటికి రాకపోవడంతో గురువారం ఉదయం తల్లి వెతకగా, చెప్పులు, మొబైల్ ఫోన్ చెరువు కట్టపై కనిపించాయి. స్థానిక మత్స్య కార్మికుల సహాయంతో చెరువులో గాలించగా శంకర్ మృతదేహం లభించింది. ఈ మేరకు పల్‌కల్ ఎస్‌ఐ క్రాంతికుమార్ పాటిల్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి



శివకుమార్ (ఫైల్)

హత్నూర, సెప్టెంబరు 19: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం అర్ధరాత్రి మంగాపూర్ గ్రామ శివారులో సంగారెడ్డి-నర్సాపూర్ ప్రధాన రహదారిపై జరిగింది. పటాన్‌చెరు మండలం చిన్నకంజర్ల గ్రామానికి చెందిన మన్నే శివకుమార్ (45) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతనికి ఇద్దరు భార్యలు, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మెదక్ జిల్లా నర్సాపూర్‌లో ఉంటున్న రెండో భార్య దగ్గరికి బుధవారం రాత్రి 11గంటలకు తన ద్విచక్రవాహనంపైన వెళ్తుండగా మంగాపూర్ గ్రామ శివారులో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన అతడిని పోలీసులు 108లో సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి తల్లి మన్నె యాదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ సుభాష్ తెలిపారు.



ముదిరాజ్ సంఘం నాయకులతో సమావేశమైన కాంగ్రెస్ నేత నీలం మధుముదిరాజ్

పండగ సాయన్న స్ఫూర్తితో హక్కుల సాధనకు ఉద్యమిద్దాం

● కాంగ్రెస్ నాయకుడు నీలం మధుముదిరాజ్

పటాన్‌చెరు, సెప్టెంబరు 19: ముదిరాజ్‌ల ముద్దుబిడ్డ పండగసాయన్న స్ఫూర్తితో హక్కుల సాధనకు ఉద్యమిద్దామని కాంగ్రెస్ నాయకుడు నీలం మధుముదిరాజ్ అన్నారు. అక్టోబర్ 21న మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో పండగసాయన్న విగ్రహావిష్కరణ, ముదిరాజ్‌ల సింహగర్జన బహిరంగ సభకు ముఖ్యఅతిథిగా హాజరుకావాలని ఆ జిల్లా ముదిరాజ్ సంఘం నాయకులు గురువారం నీలం మధును ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజికంగా ఎంతో బలవంతులైన ముదిరాజ్‌బిడ్డలకు సరైన అవకాశాలు, ప్రాధాన్యత లభించకపోవడం దురదృష్టకరమన్నారు. హక్కుల సాధన కోసం కలిసికట్టుగా పోరాడాలని సూచించారు. సమావేశంలో ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకులు గొడుగు శ్రీనివాస్, నీలం దుర్గేష్, చిల్లా సహదేవ్, కాట భాస్కర్, రంజిత్, కరుణాకర్, కొత్తూరు రమేష్, సోమయ్య, పిట్టల. ధనుంజయ్, సూరయ్య, వెంకటేశ్వర్లు, మల్లం యాకయ్య, వెంకన్న, రాములు, సత్యనారాయణ, ఉప్పలయ్య, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనుల పరిశీలన



ఆరేపల్లిలో ఈజీఎస్ పనులను తనిఖీ చేస్తున్న కేంద్ర బృందం

పెద్దశంకరంపేట, సెప్టెంబరు 19: మండలంలో నిర్వహించిన ఉపాధి హామీ పనులను కేంద్ర బృందం సభ్యులు గురువారం పరిశీలించారు. సీనియర్ ఆడిటర్ మాలకొండయ్య ఆధ్వర్యంలో ఆరేపల్లి, మూసాపేట గ్రామాల్లో ఉపాధిహామీ, సీసీ రోడ్లు తదితర అభివృద్ధి పనులను పరిశీలించారు. గ్రామాలవారీగా నివేదికలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో రఫీక్ ఉన్నిసా, ఆడిటింగ్ సిబ్బంది శ్రీనివాస్, వంశీకృష్ణ, ముజీద్, అన్సారిఅలీ, ఏపీవో నవాజుద్దిన్, టీఏలు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

● నగలు, రూ.63 వేలు అపహరణ



చిందరవందరగా పడి ఉన్న వస్తువులు

చిన్నకోడూరు, సెప్టెంబరు 19 : ఇంటి తాళం పగులగొట్టి చోరీకి పాల్పడిన సంఘటన చిన్నకోడూరు మండలంలోని రామునిపట్లలో జరిగింది. ఎస్‌ఐ బాలకృష్ణ కథనం గ్రామానికి చెందిన యాసరేణి లక్ష్మయ్యకు, తన భార్య రేణుకకు ఆరోగ్యం బాగలేనందున ఈనెల 16న ఇద్దరూ కామారెడ్డిలోని ఓ ఆస్పత్రికి వెళ్లి చూపించుకున్నారు. అనంతరం అక్కడే ఉంటున్న తమ పెద్ద కూతురు ఇంటికి వెళ్లి ఉంటున్నారు. గురువారం ఉదయం లక్ష్మయ్య ఇంటి తాళం పగులగొట్టి ఉండటాన్ని గమనించిన ఆ ఇంటికి ఎదురుగా ఉంటున్న వ్యక్తి ఫోన్ ద్వారా సమాచారమిచ్చాడు. వెంటనే లక్ష్మయ్య భార్యతో కలిసి స్వగ్రామానికి వచ్చి చూడగా బీరువాలోని తులం బంగారు ఆభరణాలు, 2 తులాల వెండి మొలతాడు, రూ.63 వేలు కనిపించలేదు. సమాచారం అందుకున్న పోలీసులు క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రహదారి పక్కన వ్యక్తి మృతదేహం లభ్యం



మృతి చెందిన పొలాస లచ్చయ్య

వర్గల్, సెప్టెంబరు 19 : వర్గల్ మండలం గౌరారం సమీపంలోని సింగాయిపల్లి క్రాస్ రోడ్డు దగ్గరలో ఓ వ్యక్తి మృతదేహం లభించింది. ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం క్రాస్ సమీపంలోని రాజీవ్ రహదారి పక్కన వ్యక్తి మృతదేహం ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు అక్కడి చేరుకుని పరిశీలించారు. మృతిచెందిన వ్యక్తి రాజన్న సిరిసిల్లా జిల్లా చందుర్తి మండలంలోని మల్యాల గ్రామానికి చెందిన పొలాస లచ్చయ్య (55)గా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. రోడ్డు పక్కనే పెన్సింగ్ వైరు దాటే క్రమంలో కిందపడి మృతి చెంది ఉంటాదని పోలీసులు భావిస్తున్నారు.

జాతీయ రహదారుల పనుల పరిశీలన



తూప్రాన్ వద్ద హైవే పార్కింగ్ ప్రదేశంలో మొక్క నాటుతున్న రీజనల్ ఆఫీసర్ శివశంకర్

తూప్రాన్. సెప్టెంబరు 19 : జాతీయ రహదారి పనులను భారత జాతీయ రహదారుల సంస్థ రీజనల్ ఆఫీసర్ పి.శివశంకర్ పరిశీలించారు. గురువారం ఎన్‌హెచ్ 44పై బోయిన్‌పల్లి నుంచి నిర్మల్ వరకు జరుగుతున్న ఆర్‌వోబీలు, రోడ్డు విస్తరణ, పార్కింగ్ పనులను పరిశీలించారు. అలాగే మెదక్ జిల్లా తూప్రాన్ టోల్ ప్లాజా వద్ద జరుగుతున్న పార్కింగ్ పనులనూ పరిశీలించి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఏఐ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు, జీఎంఆర్ హెడ్ శంకర్ గణేషన్, ప్రాజెక్ట్ మేనేజర్ వెంకటరమణ, ప్రతినిధి శ్రీనివాస్ పాల్గొన్నారు.

జిల్లాలవారీగా ఎస్సీ వర్గీకరణ చేపట్టండి

● ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి



సమావేశంలో మాట్లాడుతున్న పిడమర్తి రవి

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 19 : ఎస్సీ వర్గీకరణను జిల్లాలవారీగా చేపట్టాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, మాదిగ జేఏసీ వ్యవస్థాపకుడు పిడమర్తి రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మాదిగల మేలుకొలుపు యాత్ర గురువారం సంగారెడ్డికి చేరుకున్న సందర్భంగా ఆయన మాట్లాడారు. మాదిగ జనాభా దమాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. ఈ నెల 30న యాత్ర ముగింపు సభ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో మాదిగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యాదయ్య, జిల్లా పరిషత్ సభ్యులు మోషస్ రవి, మాదిగ జేఏసీ ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు రవికిరణ్, నాయకులు మోహన్, అరుణ, వీరేందర్, ఉపేందర్, సురేష్, జోగారావు, సాయన్న, గణేష్, రాంబాబు, జి. రమేష్, వజిత్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనంలో ఇరువర్గాల ఘర్షణ

● దాడిలో పలువురికి గాయాలు.. కేసులు నమోదు

శివ్వంపేట, సెప్టెంబరు 19: వినాయక నిమజ్జనంలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ చెలరేగి దాడి చేసుకోగా పోలీసులు కేసు నమోదు చేసిన ఘటన మండల పరిధిలోని పిల్లుట్ల, బీజిలిపూర్ గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం మండల పరిధిలోని పిలుట్ల గ్రామంలో మంగళవారం రాత్రి సిద్ధి వినాయక యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిమజ్జన కార్యక్రమంలో రెండు వర్గాల మధ్య ఘర్షణ జరుగడంతో కేసులు నమోదయ్యాయి. అలాగే బీజిలిపూరులో రెండు వర్గాలు దాడి చేసుకోగా శామిరిపేట హరీష్, మహేష్, సుధాకర్ తలలకు తీవ్ర గాయాలయ్యాయి. రెండు గ్రామాల్లో ఇరు వర్గాలకు చెందిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహిపాల్ రెడ్డి తెలిపారు.

గిరిజన వసతి గృహం నిర్వహణ అస్తవ్యస్తం

- విద్యార్థులే అన్నం వడ్డించుకోవాల్సిన దుస్థితి
- కుళ్లిపోయిన గుడ్ల పంపిణీ



శివ్వంపేట, గిరిజన వసతి గృహంలో కుళ్లిన గుడ్లు

శివ్వంపేట, సెప్టెంబరు 19 : మండల కేంద్రమైన శివ్వంపేట గిరిజన వసతి గృహంలో నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ఉన్నత అధికారుల పర్యవేక్షణ లోపం విద్యార్థుల పాలిట శాపంగా మారింది. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడం లేదు. గురువారం ఉడకపెట్టిన గుండ్లు కుళ్లిపోయి కనిపించాయి. అంతేకాకుండా వసతి గృహంలో సిబ్బంది ఉన్నప్పటికీ విద్యార్థులే తోటి విద్యార్థులకు భోజనం వడ్డించే దుస్థితి నెలకొన్నది. కొంత మంది విద్యార్థులకు గుడ్లు పంపిణీలో కోత విధించారు. అధికారుల పర్యవేక్షణ లోపంతోనే విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందడంలేదని విద్యార్థులు తల్లి దండ్రులు ఆరోపిస్తున్నారు. వార్డెన్ యాదగిరిని సంప్రదించగా మెదక్ సమావేశానికి వెళ్లానని, మళ్లీ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూస్తామని తెలిపారు.



శివ్వంపేట వసతి గృహంలో భోజనం వడ్డిస్తున్న విద్యార్థులు



కుళ్లిపోయిన మేత తిని మేకలు మృతి

కోహెడ, సెప్టెంబరు 19 : మండలంలోని రామచంద్రపూర్ గ్రామంలో 15 మేకలు గురువారం మృత్యువాత పడ్డాయి. గ్రామానికి చెందిన శాతవేణి మల్లయ్య గ్రామ శివారులోని పొలాలవద్దకు మేకలను మేతకు తీసుకెళ్లగా అక్కడున్న కుళ్ళిపోయిన మొక్కజొన్న బెండు, మక్కలు తిన్నాయి. దీంతో ఆ మేత విషపూరితంగా మారి 15 మేకలు మృతి చెందినట్లు పశు వైద్యుడు శ్రవణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సుమారు రూ.2 లక్షలు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరారు.

ఏటీఎం వద్ద మోసం చేసిన వ్యక్తి అరెస్ట్



పోలీసులు స్వాధీనం చేస్తున్న ఏటీఎం కార్డులు, నగదు, సెల్‌ఫోన్

తూప్రాన్, సెప్టెంబరు19 : ఏటీఎం వద్ద డబ్బులు డ్రా చేయడం తెలువని అమాయకులను మోసం చేసి కార్డులు మార్చి డబ్బులు డ్రా చేసుకుని పరారీలో ఉన్న ఓ వ్యక్తిని తూప్రాన్ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. ఎస్‌ఐ శివానందం కథనం ప్రకారం హరియాణా రాష్ట్రానికి చెందిన శాహేద్(44) గురువారం తూప్రాన్ ఏటీఎం వద్ద అనుమానాస్పదంగా కనిపించడంతో పట్టుకోని విచారించారు. ఈ నెల 8న ఇస్లాంపూర్ గ్రామానికి చెందిన వ్యక్తి, 11న ధాతర్‌పల్లి గ్రామానికి చెందిన వ్యక్తి ఎస్‌బీఐ ఏటీఎం కేంద్రం వద్దకు డబ్బులు డ్రా చేయడం కోసం వచ్చారు. డ్రా చేయడం వారికి తెలియకపోవడంతో చేసి ఇవ్వాలని శాహేద్‌ను కోరగా డ్రా చేసినట్లు నమ్మించి కార్డులను మార్చివేశాడు. ఇస్లాంపూర్‌కు చెందిన వ్యక్తి కార్డు నుంచి రూ.9600, ధాతార్‌పల్లి గ్రామానికి చెందిన వ్యక్తి కార్డు నుంచి రూ.45వేలు కాజేసినట్లు గుర్తించారు. అలాగే శామీర్‌పేట్‌కు చెందిన వ్యక్తి ఏటీఎం నుంచి రూ. 10వేలు డ్రా చేసినట్లు గుర్తించారు. నిందితుడి నుంచి రూ.45వేల నగదు, సెల్‌ఫోన్, 28 ఏటీఎం కార్డులను స్వాధీనం చేసుకున్నారు. మరో వ్యక్తి షకీల్ పరారీలో ఉన్నాడు. నిందితుడి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులో ముగ్గురికి రిమాండ్

మనోహరాబాద్, సెప్టెంబరు 19: గౌతోజీ గూడెం గ్రామంలో కుల బహిష్కరణ కేసు విషయంలో 19 మందిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులో ముగ్గురిని రిమాండ్‌కు తరలించారు ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం గౌతోజీగూడెం గ్రామానికి చెందిన చంద్రం ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం ముగ్గురు పరసబోయిన నర్సయ్య, చాపల కృష్ణ, పంచమి పెంటయ్య వ్యక్తులను తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి రిమాండ్‌కు తరలించారు.

ఎనిమిది తరగతులు.. ఇద్దరే ఉపాధ్యాయులు

నాగిరెడ్డిపల్లి ప్రభుత్వ పాఠశాలలో టీచర్ల కొరత

కోహీర్, సెప్టెంబరు 19 : సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో గల ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల కొరతతో విద్యార్థులకు పూర్తిస్థాయిలో విద్యాబోధన అందడం లేదు. ఒకటో తరగతి నుంచి ఎనిమిదో తరగతికి వరకు ఉన్న ఈ పాఠశాలలో ప్రస్తుతం 88 మంది విద్యార్థులు చదువుతున్నారు. మొదట 91 మంది విద్యార్థులు ఉండగా ఉపాధ్యాయులు లేరని ఇటీవలే ముగ్గురు విద్యార్థులు ఇతర పాఠశాలలో చేరారు. ఇక్కడ గత విద్యా సంవత్సరంలో ఉన్న ఆరుగురు ఉపాధ్యాయులూ ఇటీవల బదిలీ అయ్యారు. అయితే వారి స్థానంలో కేవలం ముగ్గురు ఉపాధ్యాయులనే మాత్రమే నియమించి మరో మూడు పోస్టులను బ్లాక్‌లో పెట్టారు. కేటాయించిన ముగ్గురిలో ఒక ఉపాధ్యాయురాలు తన భర్తకు ఆరోగ్య సమస్య ఉందని, డిప్యూటేషన్ కోసం రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్‌కు అర్జీ పెట్టుకోగా.. నాగిరెడ్డిపల్లి నుంచి ఆమె కోరిన చోటుకు పంపించారు. ఇక మిగిలిన ఇద్దరిలో ఒకరు ఇప్పటికీ జాయిన్ కాలేదు. దీంతో ఇక్కడి నుంచి బదిలీ అయిన మరో ఉపాధ్యాయురాలిని రిలీవ్ చేయకుండా ఇక్కడే ఉంచారు. ఫలితంగా ఆరుగురికి ఇద్దరు ఉపాధ్యాయులే ఉండడంతో అన్ని తరగతుల విద్యార్థులకు పూర్తిస్థాయిలో విద్యాబోధన అందడం లేదు. ఈ విషయమై మండల విద్యాధికారిని వివరణ కోరగా జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పనిచేస్తున్నామని, తాను చేసేది ఏమీ లేదని సమాధానం ఇచ్చారు.



అన్ని తరగతుల విద్యార్థులను ఒకే గదిలో కూర్చోబెట్టి బోధిస్తున్న ఉపాధ్యాయురాలు

సమస్యల కస్తూర్బా

- డ్రైనేజీ దుర్వాసనతో విద్యార్థినులకు అవస్థలు
- మరమ్మతులకు నోచుకోని వాటర్‌ప్లాంట్, సోలార్ వాటర్ హీటర్
- పాలకులు, అధికారులకు విన్నవించినా పట్టించుకోని వైనం
- ఇబ్బందులు పడుతున్న బాలికలు, సిబ్బంది



మద్దూరు కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల

మద్దూరు, సెప్టెంబరు 19 : బడి మానేసిన, అనాథ పిల్లలు, ఆర్థిక ఇబ్బందులతో చదువు కొనసాగించలేని బాలికల విద్యాభివృద్ధికి గురుకుల పాఠశాల తరహాలో ఏర్పాటు చేసిన మద్దూరు కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల సమస్యలతో సతమతమవుతున్నది. తాగనీటి వసతి సరిగాలేక, పారిశుధ్యం లోపించడంతో టీచర్లతో పాటు బాలికలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై అధికారులకు, ప్రజాప్రతినిదులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టింపులేకుండా పోయిందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

దోమలకు ఆవాసంగా మురుగు..

పాఠశాలలో 6 వ తరగతి నుంచి ఇంటర్ వరకు 221 మంది బాలికలు విద్యాభ్యాసాన్ని కొనసాగిస్తున్నారు. అయితే విద్యార్థినులు వినియోగించిన నీటిని బయటకు పంపే మార్గం లేకపోవడంతో పాఠశాల ఆవరణలోనే తీసిన పెద్దపెద్ద గోతుల్లోకి మళ్లిస్తున్నారు. దీంతో అవి మురుగునీటి గుంతలుగా మారి కంపును వెదజల్లుతున్నాయి. దోమలకు ఆవాసాలుగా మారడంతో విద్యార్థినులు విషజ్వరాల బారిన పడుతున్నారు. ఇక వర్షాకాలంలో ఈ సమస్య మరింత జఠిలంగా మారుతున్నదని, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులతో పాటు త్రిమాన్ కమిటీ సభ్యులు పాఠశాల పరిస్థితులపై సందర్శించినా సమస్యలకు పరిష్కారం చూపలేదని విద్యార్థినులు ఆరోపిస్తున్నారు. ఇక మినరల్ వాటర్ ప్లాంటుతో పాటు సోలార్ వాటర్ హీటర్ పాడైనా పట్టించుకునే నాథుడేలేడు. దీంతో మినరల్ వాటర్ బయట నుంచి తెప్పించాల్సిన పరిస్థితి నెలకొన్నది.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం..



పాఠశాలలో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉంది. అదికారులతోపాటు పాఠశాలను సందర్శించిన ప్రజాప్రతినిదులకూ సమస్య వివరించాం. విద్యార్థులకు మటన్‌కు బదులుగా చికెన్ అందిస్తున్నాం. అధికారుల సూచన మేరకు నీళ్లు బయటకు పంపించేందుకు ఏఈ ఎస్టిమేషన్ వేశారు. వాటర్‌ప్లాంట్‌తో పాటు సోలార్ వాటర్ మరమ్మతులు చేపించాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. -స్వప్న ఎస్‌వో మద్దూరు



కస్తూర్బా పాఠశాల ఆవరణలో తీసిన మురుగు గుంత

పాఠశాలల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న మరుగుదొడ్లు, మూత్రశాలల సమస్యలపై ఇటీవల విద్యాకమిషన్ చైర్మన్ ఆకునూరు మురళి కస్తూర్బాను సందర్శించినా పూర్తిస్థాయిలో సమస్యలపై దృష్టిసారించలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నో బెడ్‌షీట్స్.. నో మటన్..

బాలికలకు ఏడాదికి రెండు జతల యూనీఫామ్స్‌తో పాటు నెలనెలా రూ.100 కాస్మోటిక్ చార్జీలు బాలికల అకౌంట్‌లో ప్రభుత్వం జమచేస్తుంది. అయితే బెడ్‌షీట్స్ అందించడంలో తీవ్రజాప్యం జరుగుతోంది. వారంలో 5 మార్లు ఎగ్స్ , ఉదయం టిఫిన్స్, సాయంత్రం స్నాక్స్ అందించడంతో పాటు మెనూ ప్రకారం ఒక్కో విద్యార్థికి 100 గ్రాముల చొప్పున నెలలో 4 సార్లు చికెన్, 2 సార్లు మటన్ అందించాల్సి ఉన్నది. అయితే మటన్ పెట్టడం లేదని, ఈ ఏడాదిలో ఒక్కసారి మాత్రమే మటన్ అందించినట్లు తెలిసింది.

చదువుతో పాటు క్రీడల్లోనూ ముందుండాలి

● డీఈవో శ్రీనివాస్‌రెడ్డి

కుకునూరుపల్లి, సెప్టెంబరు 19: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని డీఈవో శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. కుకునూరుపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం మండలస్థాయి ఎస్జీఎఫ్ క్రీడలను ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు, తహసీల్దార్ మల్లికార్జున్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్తయ్య, పీఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్ పొల్కంపల్లి నరేందర్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.

● సిద్దిపేట టౌన్: క్రీడల్లో గెలుపోటములు సహజమని, వాటిని సమానంగా తీసుకుని ముందుకు సాగాలని సిద్దిపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులరాజనర్సు సూచించారు. సిద్దిపేట పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సిద్దిపేట అర్బన్ పాఠశాలల విద్యార్థులకు గురువారం అండర్ 14 విభాగంలో వాలీబాల్ పోటీలను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈవో యాదవరెడ్డి, పాఠశాలలు ఉపాధ్యాయులు, పీఈటీలు, స్థానిక నాయకులు పయ్యావుల ఎల్లం తదితరులు పాల్గొన్నారు

● తొగుట: క్రీడలు మానసికోల్లాసంతో పాటు, శారీరక దృఢత్వానికి దోహదం చేస్తాయని తొగుట ఎంఈవో సత్తు యాదవరెడ్డి అన్నారు. తొగుట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండలస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్ 14, అండర్ 17 విభాగంలో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో క్రీడా పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉపేందర్, నరసయ్య, అంజిరెడ్డి, నయమ కౌసర్, ఫిజికల్ డైరక్టర్‌లు మురళీధర్, పీఈటీలు కనకయ్య, భాస్కర్‌రెడ్డి, సుస్మిత, రాజు, కిషన్ కృష్ణ, రాము, నాగరాజు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు రాంచంద్రారెడ్డి, రాములు, మల్లేశం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



తొగుట: బాలికల కబడ్డీ ఆటను తిలకిస్తున్న ఎంఈవో సత్తు యాదవరెడ్డి



జగదేవ్‌పూర్: తిగుల్ పాఠశాలలో క్రీడలను ప్రారంభిస్తున్న ఎంఈవో ఉదయభాస్కర్‌రెడ్డి



సిద్దిపేట టౌన్: వాలీబాల్ పోటీల సందర్భంగా ఆటాడుతున్న మంజులరాజనర్సు

● జగదేవ్‌పూర్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించినప్పుడే గుర్తింపు లభిస్తుందని ఎంఈవో ఉదయభాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని తిగుల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడల పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో యాదగిరి, పీఏసీఎస్ డైరెక్టర్ భూమయ్య, మండల నోడల్ అధికారి మాధవరెడ్డి, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సైదులు, కనకయ్య, అనసూయ, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, టీపీటీఎఫ్ అధ్యక్షుడు సత్తయ్య యూటీఎఫ్ అధ్యక్షుడు రాజనర్సయ్య, పీఈటీలు ఎల్లేశ్వర్‌రావు, రాజిరెడ్డి, నరేష్, చారి, కవిత, మాజీ ప్రజాప్రతినిధులు దయానంద్‌రెడ్డి, బిక్షపతి, బాలకృష్ణారెడ్డి, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.



కుకునూరుపల్లి: క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీఈవో శ్రీనివాస్‌రెడ్డి

● రాయపోల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో ఈ నెల 20, 21న రాయపోల్‌లో మండల స్థాయి టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు ఎంఈవో నర్సవ్వ తెలిపారు. వాలీబాల్, కబడ్డీ, కోకో పోటీలు జరుగుతాయని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు రాయపోల్ ఉన్నత పాఠశాల పీఈటీ గోవర్ధన్‌రెడ్డిని సంప్రదించాలని పేర్కొన్నారు.

● గజ్వేల్: ఈ నెల 24, 25తేదీల్లో గజ్వేల్ మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలను నిర్వహిస్తున్నట్లు గజ్వేల్ ఎంఈవో సునిత తెలిపారు. క్రీడల్లో పాల్గొనే విద్యార్థులు బోనాఫైడ్‌పై ఫోటో అటెస్టెడ్‌తో రావాలని, వివరాలకు మండల ఎస్జీఎఫ్ కార్యదర్శి 9603783280 నెంబర్‌ను సంప్రదించాలన్నారు. ఆమెవెంట గజ్వేల్ మండల ప్రధానోపాధ్యాయులు, పీడీలు, పీఈటీలు ఉన్నారు

'క్షయ రహిత సమాజం కోసం కృషి చేయాలి'



సిబ్బందితో మాట్లాడుతున్న శ్రీనివాస్

మద్దూరు, సెప్టెంబరు 19: ప్రతి ఒక్కరూ క్షయ రహిత సమాజం కోసం కృషి చేయాలని టీబీ అలర్టు ఇండియా ఇంపాక్ట్ ప్రోగ్రాం అధికారి డి. శ్రీనివాస్ సూచించారు. మండలంలోని లద్నూరు పీహెచ్‌సీ పరిధిలోని రేబర్తి గ్రామ ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రంలో టీబీని జయించిన ఛాంపియన్స్ గుర్తించేందుకు గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. క్షయవ్యాధి నిర్మూలనకు మందులు వాడి కోలుకున్న వారి ద్వారా ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలన్నారు. అవగాహన కార్యక్రమాలతో టీబీ లక్షణాలలు ఉన్న వారు ముందుకు వచ్చేలా చేసి చికిత్సలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఆయుష్మాన్ ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి సువర్ణ సన్, హెచ్‌ఈవో భువనేశ్వర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి జాదవ్ మాధవ్, ఏఎన్ఎం మల్లేశ్వరి, ఆశాలు కనకలక్ష్మి, కవిత, యశోద పాల్గొన్నారు

హెచ్ఐవీపై అవగాహన ఉండాలి

● ఎయిడ్స్ కంట్రోల్ అధికారి రేషవేని తిరుపతి

హుస్నాబాద్‌రూరల్, సెప్టెంబరు 19: హెచ్ఐవీ పట్ల యువతీ, యువకులు అవగాహన కలిగి ఎయిడ్స్ రహిత సమాజం కోసం పాటు పడాలని ఎయిడ్స్ కంట్రోల్ అధికారి రేషవేని తిరుపతి పేర్కొన్నారు. హుస్నాబాద్ పట్టణంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో 9, 10 తరగతి విద్యార్థులకు హెచ్ఐవీపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎయిడ్స్ వ్యాధిగ్రస్థులపై వివక్షత చూపకూడదని, వ్యాధి నిర్మూలన కోసం ప్రభుత్వం అందించే ఏఆర్‌టీ మందులు వాడే విధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ కాయిత నారాయణ రెడ్డి, ఉపాధ్యాయులు గుండు కిరణ్‌కుమార్ ఉపాధ్యాయులు ఉన్నారు.

అందె ఆలయంలో కలకలం

మిరుదొడ్డి, సెప్టెంబరు 19: మండలంలోని అందె గ్రామంలో విబేధాలను సృష్టించేందుకు కొందరు గుర్తు తెలియని వ్యక్తులు పురాతన ఆలయంపై పేడనీళ్లు చల్లారు. గోడలపైనే కాకుండా లోపలికి పడేలా పేడ నీళ్లు చల్లడంతో భక్తులు చూసి గ్రామస్థులకు సమాచారం ఇచ్చారు. అంతా కలిసి ఆ ప్రాంతాన్ని శుభ్రం చేశారు. ఈ ఘటనపై పోలీసులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

పాఠశాల తనిఖీ

కుకునూరుపల్లి, సెప్టెంబరు 19: సిద్దిపేట జిల్లా డీఈవో శ్రీనివాస్‌రెడ్డి మండలంలోని తిప్పారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వారి సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. పాఠశాలకు వచ్చిన డీఈవోను ఉపాధ్యాయ బృందం సత్కరించింది.

నేడు మల్లన్నసాగర్‌కు సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

తొగుట, సెప్టెంబరు 19: తొగుట మండలం తుక్కాపూర్ గ్రామ శివారులో 50 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిన మల్లన్నసాగర్ రిజర్వాయర్‌ను సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకరరెడ్డితో కలిసి నేడు సందర్శించనున్నట్లు మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

సత్ప్రవర్తనతో మెదలాలి : చేర్యాల సీఐ శ్రీను

చేర్యాల, సెప్టెంబరు 19: ఇతరులతో సత్ప్రవర్తనతో మెదలాలని చేర్యాల సీఐ ఎల్. శ్రీను అన్నారు. చేర్యాల సర్కిల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలువురు రౌడీ షీటర్లు, పాత నేరగాళ్లకు గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్ కార్యాలయ ఆవరణలో ఆయన కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రశాంత వాతావరణానికి భంగం కలిగించి గొడవలు, తగాదాలకు పాల్పడకూడదని, ఏమాత్రం ఉల్లంఘించినా చట్టపరంగా కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. అందరిపై తమ నిఘా ఉందని, ఎవరూ తప్పు చేసినా తగిన శిక్ష అనుభవించక తప్పదన్నారు. సాధారణ వ్యక్తుల్లా వ్యవహరిస్తూ కష్టపడి పనిచేసి కుటుంబసభ్యులతో సంతోషంగా గడపాలని సూచించారు.

గజ్వేల్ వాసికి పీహెచ్‌డీ

గజ్వేల్, సెప్టెంబరు 19: గజ్వేల్ పట్టణానికి చెందిన గంగాల నరేశ్ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పట్టా పొందారు. 'అప్లికేషన్ ఆఫ్ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ఇన్ ఇండస్ట్రియల్ ఎయిర్ పొల్యూషన్ మానిటరింగ్ అండ్ డేటా ఎనాలసిస్' పరిశోధనను, అసోసియేట్ ప్రొఫెసర్ బి.ఇందిరా ఆధ్వర్యంలో పూర్తి చేశాడు.

స్టీల్ బ్యాంకుపై అవగాహన

మద్దూరు, సెప్టెంబరు 19: ప్లాస్టిక్ వాడకంతో అనేక సమస్యలు ఎదురవుతాయని ఎంపీడీవో ఎస్. రామ్మోహన్ తెలిపారు. మండలంలోని రేబర్తిలో గురువారం ఏర్పాటు చేసిన స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో స్టీల్ బ్యాంకు ప్రదర్శనలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకాన్ని నిరోధించాలని సూచించారు. తడి, పొడి చెత్త వేరు చేసే పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జాదవ్ మాధవ్, ఫీల్డు అసిస్టెంట్ అయిలయ్య, ఏఎన్ఎం మల్లేశ్వరి ఆశాలు యశోద, కవిత, కనకలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు నిర్మల, అనురాధ, మహిళా సంఘాల సభ్యులు జయమ్మ, సబిత పాల్గొన్నారు.

పీఆర్టీయూ దుబ్బాక అర్బన్ అధ్యక్షుడిగా శ్రీనివాస్‌గౌడ్

దుబ్బాక, సెప్టెంబరు 19: పీఆర్టీయూ దుబ్బాక అర్బన్ అధ్యక్షుడిగా పల్లెశ్రీనివాస్‌గౌడ్, మండల అధ్యక్షుడిగా రామచంద్రారెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు గురువారం జిల్లా ప్రధానకార్యదర్శి ఇంద్రసేనారెడ్డి తెలిపారు. మండల ప్రధాన కార్యదర్శిగా బుచ్చిబాబు, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా మంజుల, కార్యవర్గసభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వెంకటరాజం, శ్రీనివాస్, చంద్రారెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు.

జీపీగా మార్చాలని మంత్రికి వినతి

చేర్యాల, సెప్టెంబరు 19: చేర్యాల మండలం వేచరేణి గ్రామ శివారు ఎల్లదాసునగర్ కాలనీని ప్రత్యేక గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలని కోరుతూ కొమురవెల్లి మండల కాంగ్రెస్ నాయకులు గురువారం పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్కకు వినతిపత్రం అందించారు. ఎల్లదాసునగర్ కాలనీ వేచరేణి గ్రామానికి ఒకటిన్నర కిలోమీటరు దూరంలో ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతుండటంతో పాటు మౌలిక వసతుల కల్పనకు నోచుకోక అభివృద్ధిలో వెనకబాటుకు గురైందని వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కొమురవెల్లి మండలాధ్యక్షుడు మహదేవుని శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సనాది భాస్కర్, లెనిన్‌నగర్ వాసులు కడమంచి ఆంజనేయులు, నూనె రమేశ్, కళ్లెం చంద్రమౌళి పాల్గొన్నారు.

బీడీ కార్మికుల ఈపీఎఫ్ రూ. 1000 నుంచి రూ. 5000 పెంచాలి

● బీఎంఎస్ జిల్లా అధ్యక్షుడు ముద్దం రాజిరెడ్డి



ధర్నా చేస్తున్న బీఎంఎస్ నాయకులు, కార్మికులు

సిద్దిపేట అర్బన్, సెప్టెంబరు 19: బీడీ కార్మికుల ఈపీఎఫ్ పెన్షన్ 1000 నుంచి 5000 రూపాయలకు పెంచాలని బీఎంఎస్ జిల్లా అధ్యక్షుడు ముద్దం రాజిరెడ్డి డిమాండ్ చేశారు. సిద్దిపేటలోని ఈపీఎఫ్ కార్యాలయం ఎదుట గురువారం బీఎంఎస్ ఆధ్వర్యంలో రిటైర్డ్ బీడీ కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీడీ కార్మికులు రిటైర్ అయిన తర్వాత వచ్చే ఈపీఎఫ్ పెన్షన్ గతంలో ఒక్క రూపాయి నుంచి 100 రూపాయలకు వచ్చిందని, ఆ తర్వాత పది సంవత్సరాలుగా వెయ్యి రూపాయలు మాత్రమే ఇస్తున్నారని అన్నారు. అనంతరం ఈపీఎఫ్ కమిషనర్ అవినాష్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సిల్వర్ కిష్టయ్య, దొంతుల మల్లేశం, చంద్రమౌళి, సరిత, వసంత, అనిత తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉచిత సర్వీస్ క్యాంపు

సిద్దిపేట రూరల్, సెప్టెంబర్ 19: సిద్దిపేటలోని సాయిలక్ష్మి ట్రాక్టర్ షోరూమ్ ఆధ్వర్యంలో రేపు నారాయణరావుపేట మండల కేంద్రంలో జాన్ డియర్ ట్రాక్టర్ ఉచిత సర్వీస్ క్యాంపు ఏర్పాటు చేస్తున్నట్లు బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాస్‌రావు, సేల్స్ ఎగ్జిక్యూటివ్ శ్రీనివాస్‌రెడ్డి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నారాయణరావుపేట మండల కేంద్రంలో ఐకేపీ కొనుగోలు కేంద్రం వద్ద సర్వీస్ క్యాంపు ఏర్పాటు చేస్తున్నామని, ఈ సర్వీస్ క్యాంపులో జాన్ డియర్ ట్రాక్టర్‌కు సంబంధించి ఏ సమస్య ఉన్నా ఉచితంగా రిపేర్ చేస్తామన్నారు.

'ఇందూర్'లో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్



కార్యక్రమంలో ప్రజెంటేషన్ ఇస్తున్న విద్యార్థులు

సిద్దిపేట అర్బన్, సెప్టెంబరు 19: ఇందూర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో గురువారం స్మార్ట్ ఇండియా హ్యాకథాన్‌పై అంతర్గత పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ వి.పి. రాజు మాట్లాడుతూ.. స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ అనేది దేశం ఎదుర్కొంటున్న కొన్ని ముఖ్యమైన సమస్యలను పరిష్కరించడానికి, విద్యార్థులకు ఒక వేదికను అందించడానికి భారత ప్రభుత్వం ప్రారంభించిన దేశవ్యాప్త కార్యక్రమం అన్నారు. ఈ పోటీల్లో 42జట్లు పాల్గొన్నట్లు తెలిపారు. కోఆర్డినేటర్ పరశురాములు మాట్లాడుతూ.. నూతన ఆవిష్కరణలకు స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ ఒక వేదిక అన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బెనర్జీ, భాగ్యరెడ్డి, బొడ్డు రఘు, పీఆర్‌వో, హెచ్‌వోడీస్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలి

● ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో ఆనంద్

తొగుట, సెప్టెంబరు 19: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో ఆనంద్ సూచించారు. తొగుట ప్రభుత్వ ఆసుపత్రిని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్, ఆస్పత్రి వైద్యులు రాధాకిషన్ తదితరులు పాల్గొన్నారు.

● నంగునూరు: గ్రామాలను పచ్చగా మార్చడమే ప్రభుత్వ ధ్యేయమని డీపీవో, మండల ప్రత్యేకాధికారి దేవకీదేవి అన్నారు. స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా నంగునూరు గ్రామ పంచాయతీ ఎదుట మొక్కలు నాటారు. అంతకుముందు గ్రామ పంచాయతీ సిబ్బందికి పది లక్షల బీమా పత్రాలను, యూనిఫామ్‌లను అందజేసి ప్రభుత్వ ఆసుపత్రిలో వారికి ఆరోగ్య పరీక్షలు చేయించారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మప్ప, ఎంపీవో సత్యనారాయణ, సూపరింటెండెంట్ ప్రభాకర్‌రావు, పంచాయతీ కార్యదర్శి చంద్రకళ, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● సిద్దిపేట టౌన్: చెత్తను తడి, పొడి, హానికర చెత్తగా వేరు చేసి ప్రతీరోజు చెత్త సేకరణకు వచ్చే సిబ్బందికి అందజేయాలని సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ సూచించారు. సిద్దిపేట పట్టణంలోని 5వ వార్డులో కౌన్సిలర్ వినోద్‌గౌడ్‌తో కలిసి ఆయన ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించారు. స్వచ్ఛతా హి సేవలో భాగంగా వార్డులో పర్యటిస్తూ ఇంట్లోని చెత్తను ప్రతీ మంగళవారం, శుక్రవారం పొడి చెత్త మిగిలిన వారాల్లో తడి చెత్తగా వేరు చేసి ఇవ్వాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ తదితరులు పాల్గొన్నారు.



నంగునూరు: ప్రభుత్వ ఆసుపత్రిలో పంచాయతీ సిబ్బందికి వైద్య పరీక్షలు చేయిస్తున్న డీపీవో దేవకీదేవి

● గజ్వేల్ రూరల్: పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దరిచేరవని ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ సూచించారు. గజ్వేల్ మండల పరిధిలోని కొడకండ్ల ప్రాథమిక పాఠశాలలో స్వచ్ఛత-పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, ఉపాధ్యాయులు రెహేల, కల్పన, ఆశావర్కర్లు, రాజమణి, వినోద, అంగన్‌వాడీ టీచర్లు పద్మ, రమ, ఆయాలు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

● హుస్నాబాద్: హుస్నాబాద్ పట్టణంలోని ప్రభుత్వ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కమిషనర్ రాజమల్లయ్య, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, కౌన్సిలర్ దొడ్డి శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు వెంకటయ్య, వాసుదేవరెడ్డి, రవికుమార్ ఉన్నారు.

పనివేళలు శాస్త్రీయంగా ఉండాలి



మాట్లాడుతున్న కెవలి అహ్మద్

గజ్వేల్ రూరల్, సెప్టెంబరు 19: పనివేళలు శాస్త్రీయంగా ఉండాలని టీజీ యూటీఎఫ్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు ఎస్. కెవలి అహ్మద్ అన్నారు. ప్రజ్ఞాపూర్‌లోని గురుకుల పాఠశాలలో గురువారం గురుకుల జేఏసీ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో ప్రదర్శన చేశారు. పాఠశాలల పనివేళలు విద్యార్థుల మానసిన వికాసానికి తగిన విధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో గురుకుల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'పార్టీ వ్యతిరేకులను సస్పెండ్ చేయాలి'

చేర్యాల, సెప్టెంబరు 19: పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగిస్తూ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న జనగామ కాంగ్రెస్ నాయకులను అధిష్ఠానం వెంటనే సస్పెండ్ చేయాలని చేర్యాల మండలాధ్యక్షుడు కొమ్ము రవి డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీలో ఎన్నో ఉన్నత పదవులు పొందిన జనగామ నేతలు ఎనమల్ల సుధాకర్, వేమల్ల సత్యనారాయణరెడ్డి, మాసాన్‌పల్లి లింగాజీ తదితరులు ప్రతిపక్ష నేతలతో కుమ్మక్కై ఇంటిదొంగల్లా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. జనగామలో జరిగిన ప్రజాపాలన దినోత్సవ వేడుకలలో జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని సభా వేదికపై నుంచి కిందికి దిగాలని అల్లరి సృష్టించి పార్టీకి చెడ్డపేరు తీసుకువచ్చారన్నారు. సమావేశంలో పార్టీ పట్టణాధ్యక్షుడు మంచాల చిరంజీవులు, కౌన్సిలర్లు ఆడెపు నరేందర్, చెవిటి లింగం, ముస్త్యాల తారయాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

'రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి'

చేర్యాల, సెప్టెంబరు 19: రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ టి.సీతారాం కోరారు. చేర్యాల మండలకేంద్రంలో గురువారం నిర్వహించిన యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం చేర్యాల డివిజన్ కమిటీ అధ్యక్షుడుడిగా మంతెన అంజిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కరెడ్ల రాజిరెడ్డి, కోశాధికారిగా పుట్ట యాదయ్య, ఉపాధ్యక్షులుగా పాండురంగం, అంజనీదేవీ, మహేంద్రం, కార్యదర్శులుగా బి.రామ్మూర్తి, రాపెల్లి సుదర్శనం, వి.రాంబ్రహ్మం, సభ్యులుగా అశోక్, పుష్పలత ఎన్నికయ్యారు.

ఓటుహక్కు నమోదు చేసుకోవాలి

● ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి యాదగిరి శేఖర్‌రావు

కోహెడ, సెప్టెంబరు 19: పట్టభద్రులంతా తమ ఓటుహక్కును నమోదు చేసుకోవాలని ట్రస్మా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి యాదగిరి శేఖర్‌రావు అన్నారు. కోహెడలోని ఓ ఫంక్షన్ హాల్లో గురువారం పట్టభద్రులను, ప్రైవేట్ స్కూల్ కరస్పాండెంట్లను ఆయన కలిశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. రాబోయే ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్, నిజామాబాద్ జిల్లాలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తాను స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేయాలంటే పట్టభద్రులంతా ఆన్‌లైన్‌లో తమ పేరు నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని వివిధ పాఠశాలల కరస్పాండెంట్‌లు, పట్టభద్రులు పాల్గొన్నారు.

'దుండగులను కఠినంగా శిక్షించాలి'

గజ్వేల్ రూరల్, సెప్టెంబరు 19: భారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. మెదక్ జిల్లా శివంపేట మండల్ కొంతాన్‌పల్లిలో అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన గుర్తించి కఠినంగా శిక్షించాలన్నారు. ఆయనవెంట చంద్రం పాల్గొన్నారు.

తూము నుంచి వృథాగా పోతున్న నీరు

హుస్నాబాద్, సెప్టెంబరు 19: హుస్నాబాద్ పట్టణంలోని ఎల్లమ్మ చెరువు పెద్ద తూము నుంచి నీరు వృథాగా పోతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెరువు తూము వద్ద గురువారం రైతులు అధికారుల తీరుపై నిరసన వ్యక్తం చేశారు. 15 రోజులుగా తూము వద్ద లీకై భారీగా నీరు బయటకు పోతున్నదని, ఈ విషయాన్ని ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇలాగే నీరు బయటకు పోతే ఒక నెలలో చెరువు పూర్తిగా ఖాళీ అయ్యే ప్రమాదముందన్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు.



ఎల్లమ్మ చెరువు నుంచి వృథాగా పోతున్న నీరు

రాహుల్‌పై వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలి



చిన్నకోడూరు: నినాదాలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

చిన్నకోడూరు, సెప్టెంబరు 19: రాహుల్‌గాంధీపై చేసిన వ్యాఖ్యలను తక్షణమే ఉపసంహరించుకోవాలని కాంగ్రెస్ నాయకులు మీసం మహేందర్ యాదవ్ డిమాండ్ చేశారు. రాహుల్‌గాంధీపై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా గురువారం చిన్నకోడూరులో బీజేపీ నేత తర్వీందర్‌సింగ్ ఫ్లెక్సీని దహనం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పరుశురాం, రాజు, గణేష్, స్వామి, రాజేష్, భూపతిరెడ్డి, ప్రశాంత్, చాంద్ పాషా, వెంకటేష్, సంపత్, గణేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

● గజ్వేల్ రూరల్/గజ్వేల్: దేశంలో నెలకొన్న దుస్థితిని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ నిలదీస్తుండడంతో బీజేపీ జీర్ణించుకోలేకపోతున్నదని కాంగ్రెస్ గజ్వేల్ పట్టణ ప్రధాన కార్యదర్శి రాములుగౌడ్ విమర్శించారు. గజ్వేల్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు.

● దుబ్బాక/మిరుదొడ్డి: బీఆర్ఎస్ నాయకులు ప్రజల్లో విశ్వాసం కోల్పోయే కాంగ్రెస్‌పై బురదజల్లె ప్రయత్నం చేస్తున్నారని ఆ పార్టీ మిరుదొడ్డి మండల అధ్యక్షుడు మద్దెల రాజేశం, భూపాల్‌గౌడ్, కిష్టయ్య, సీనియర్ నాయకుడు సంజీవరెడ్డిలు మండిపడ్డారు. దుబ్బాకలో బీఆర్ఎస్ నాయకుల దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సాయిలు, హర్షద్, కనకారెడ్డి, సుదర్శన్, కుమార్ తదితరులున్నారు.

రాహుల్‌గాంధీ బేషరతుగా క్షమాపణ చెప్పాలి

● బీజేపీ రాష్ట్ర నాయకులు వెంకటరమణ, జశ్వంత్‌రెడ్డి

గజ్వేల్, సెప్టెంబరు 19: దేశంలో అశాంతి నెలకొందని, స్వేచ్ఛ లేదని మాట్లాడిన ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ దేశ ప్రజలకు తక్షణమే బేషరతుగా క్షమాపణ చెప్పాలని బీజేపీ రాష్ట్ర నాయకులు వెంకటరమణ, మాదాడి జశ్వంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. గజ్వేల్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో గురువారం బీజేపీ మండలాధ్యక్షుడు పంజాల అశోక్‌గౌడ్, పట్టణాధ్యక్షుడు మనోహర్‌యాదవ్ ఆధ్వర్యంలో రాహుల్‌గాంధీ చిత్రపటాన్ని దహనం చేశారు. వారితో నాయకులు ఎల్కంటి సురేశ్, ఉప్పల మధు, జనార్దన్, శివకుమార్, శేఖర్, మహేందర్, బారు అరవింద్, సందీప్, ఇప్ప స్వామి, కూర స్వామి, భీం కుమార్, చాకలి రాజు తదితరులున్నారు.

'గొప్ప ఆర్థిక శక్తిగా ఎదుగుతున్న భారత్'



పట్టణంలో విలేకరులతో మాట్లాడుతున్న గురువారెడ్డి

గజ్వేల్, సెప్టెంబరు 19: దేశంలో చేపడుతున్న ఆర్థిక సంస్కరణల విజయవంతం కావడంతో గొప్ప ఆర్థిక శక్తిగా భారత్ ఎదుగుతున్నదని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ధరం గురవారెడ్డి అన్నారు. గజ్వేల్ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలకు భిన్నంగా ప్రధాని నరేంద్రమోదీ అవినీతి, అక్రమాలకు అవకాశం కల్పించకుండా మూడోసారి అధికారం చేపట్టిన కేవలం 100 రోజుల్లోనే రూ.15 లక్షల కోట్ల వ్యయంతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్లు స్పష్టం చేశారు. కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ పరిపక్వత లేని వ్యాఖ్యలు చేస్తూ ప్రపంచ దేశాల్లో దేశ పరువును మంటగలుపుతున్నారని ఆరోపించారు. ఆయనవెంట నాయకులు మాదాడి జశ్వంత్‌రెడ్డి, వెంకటరమణ, న్యాయవాది రమణ, పార్టీ పట్టణ అధ్యక్షుడు మనోహర్‌యాదవ్ తదితరులున్నారు.

బీజేపీతోనే దేశంలో సుస్థిర పాలన

● కొమురవెల్లి మండలాధ్యక్షుడు బూర్గోజు నాగరాజు



కోహెడ: సభ్యత్వాన్ని అందజేస్తున్న మండలాధ్యక్షుడు వెంకటేశం

చేర్యాల, సెప్టెంబరు 19: ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంతో బీజేపీ హయాంలో దేశంలో సుస్థిరపాలన కొనసాగుతున్నదని బీజేపీ కొమురవెల్లి మండలాధ్యక్షుడు బూర్గోజు నాగరాజు పేర్కొన్నారు. కొమురవెల్లి మండలం గౌరాయపల్లిలో గురువారం పార్టీ సభ్యత్వ నమోదు చేపట్టిన సందర్భంగా ఆయన మాట్లాడారు. సభ్యత్వ నమోదు విజయవంతానికి పార్టీ శ్రేణులు పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు దండ్యాల లక్ష్మారెడ్డి, దండ్యాల భిక్షపతిరెడ్డి, పుట్ట కనకయ్య కొయ్యడ నవీన్, ఈగ కనకయ్య, చల్ల రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● కోహెడ: బీజేపీ సభ్యత్వ లక్ష్యాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ మండలాధ్యక్షుడు ఖమ్మం వెంకటేశం కోరారు. మండలంలోని బస్వాపూర్‌లో గురువారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి సామల గిరిధర్, పుల్లూరి నవీన్‌చారి, మాజీ సర్పంచ్ మ్యాకాల చంద్రశేఖర్‌రెడ్డి, కెడికె కిష్టారెడ్డి, తుపాకుల రవీందర్, తాటిపాముల సురేష్, నరేందర్, తిరుపతి, ఎడబోయిన రాములు, గంప బాబు, ఉన్నారు.

ఓటరు జాబితాపై అభ్యంతరాలు ఉంటే తెలపాలి

● డీపీవో దేవకీదేవి, ఎంపీడీవోలు

● రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం

నంగునూరు, సెప్టెంబరు 19: గ్రామాల్లో వార్డుల వారీగా ప్రదర్శనకు ఉంచిన ఓటర్ జాబితాపై అభ్యంతరాలు తెలుపాలని డీపీవో, మండల ప్రత్యేకాధికారిణి దేవకీదేవి తెలిపారు. గురువారం నంగునూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వివిధ పార్టీ నాయకుల సమావేశం ఏర్పాటు చేసి అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మప్ప, ఎంపీవో సత్యనారాయణ, సూపరింటెండెంట్ ప్రభాకర్ రావు, పార్టీల నాయకులు పాల్గొన్నారు.

రాయపోల్: డ్రాఫ్ట్ ఓటర్ లిస్టులపై రాయపోల్ మండల పరిషత్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో అధికారులు సమావేశం నిర్వహించారు. గ్రామ పంచాయతీల వారీగా డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా నోటీసు బోర్డులో పెట్టామని, వాటిపై అభ్యంతరాలు ఏమైనా ఉంటే తమకు తెలియజేయాలని ఎంపీడీవో బాలయ్య, ఎంపీవో శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు రాజాగౌడ్, బీఆర్ఎస్ నాయకులు సత్యం, నవీన్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

● మద్దూరు: ఓటరు జాబితాపై మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించినట్లు ఎంపీడీవో తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో వీరరాజ్, కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి, వివిధ పార్టీల అధ్యక్షకార్యదర్శులు పాల్గొన్నారు.

● సిద్దిపేట రూరల్: నారాయణరావుపేట మండల పరిషత్ కార్యాలయంలో రాజకీయ పార్టీ నాయకులతో స్థానిక సంస్థల ఎన్నికల ముసాయిదా ఓటరు జాబితా, అభ్యంతరాలపై ఎంపీడీవో శ్రీరాములు సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంపీవో శ్రీనివాస్‌రావు, రాజకీయ పార్టీల మండల అధ్యక్షులు బర్మ రాంచంద్రం, కోనయ్యగారి ఎల్లయ్య, పోన్నాల బాబు, మాజీ ఎంపీపీ ఒగ్గు బాలకృష్ణ, నాయకులు రమేష్‌గౌడ్, భూమయ్య, తదితరులు పాల్గొన్నారు.

● చేర్యాల: కొమురవెల్లి మండలానికి చెందిన వివిధ రాజకీయపార్టీల నేతలతో ఓటరు జాబితాపై ఎంపీడీవో కుమారస్వామి చర్చించారు.

● కోహెడ: స్థానిక సంస్థల ఎన్నికల ఓటర్ జాబితా ముసాయిదాపై కోహెడ మండల పరిషత్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఎంపీడీవో జీ క్రిష్ణయ్య, ఎంపీవో శోభ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీవో ఎం శోభ, సీనియర్ అసిస్టెంట్ మారుతీప్రసాద్, బీజేపీ మండల అధ్యక్షుడు ఖమ్మం వెంకటేశం, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెరుగు నరేందర్‌రెడ్డి, ఆవుల మహేందర్, కాంగ్రెస్ మండల ప్రధానకార్యదర్శి వేల్పుల వెంకటస్వామి, సీపీఐ మండల కార్యదర్శి ముంజ గోపిగౌడ్, బీఎస్పీ మండల అధ్యక్షుడు వేల్పుల మహేష్, ధర్మసమాజ్ పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, నాయకులు గుగ్గిళ్ల శ్రీనివాస్, చిట్యాల అశోక్, ముంజ తిరుపతిగౌడ్, ఇల్లందుల శ్రీనివాస్ తదితరులున్నారు.

● జగదేవ్‌పూర్: మండల కార్యాలయంలో ఎంపీడీవో యాదగిరి అధ్యక్షతన వివిధ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నరసింహారెడ్డి, భాస్కర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, బీజేపీ మండల అధ్యక్షుడు దాసరి ఐలయ్య యాదవ్, సీపీఐ మండల అధ్యక్షుడు నరసింహారెడ్డి, ఎంపీవో కాజా మొహినొద్దీన్, కార్యాలయ అధికారులు పాల్గొన్నారు.

● గజ్వేల్: ఓటరు జాబితాలో అభ్యంతరాలపై ఆయా రాజకీయ పార్టీల నాయకులతో గజ్వేల్ ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ సమావేశమయ్యారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 26న డీపీవో ద్వారా మార్పుచేర్పులు చేసుకునే అవకాశం ఉందన్నారు. 29న తుది ఓటరు జాబితా ప్రచురితమవుతుందని ఎంపీడీవో తెలిపారు.



రాయపోల్: పార్టీల నాయకులతో మాట్లాడుతున్న అధికారులు

కాంగ్రెస్ పథకాలు చరిత్రలో నిలుస్తాయి

● సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్

సిద్దిపేట టౌన్, సెప్టెంబరు19: దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన పథకాలు చరిత్రలో నిలిచిపోతాయని ఆ పార్టీ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ పేర్కొన్నారు. సిద్దిపేట పట్టణంలోని 9వ వార్డులో గురువారం ఆర్పీలతో కలిసి అత్తు ఇమామ్ రూ. 500లకే గ్యాస్ సిలిండర్ మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉన్నప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పథకాలు ప్రజలకు ఇప్పటికీ అందుతున్నాయన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రతీ హామీని అమలు చేసి చూపిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గయాసుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.